క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వర స్వామి

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో బుధవారం భీష్మ ఏకాదశి సందర్భంగా విశేష అర్చనలు నిర్వహించారు. పవనగిరి వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో వేంకటేశ్వర, శ్రీకృష్ణ, లక్ష్మీనారాయణ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వనవాసీ కళ్యాణ ఆశ్రమ్ సభ్యులు, సత్సంగం మహిళలు భక్తి గీతాలు ఆలపించి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: యువతను క్రీడా రంగంలో ప్రోత్సహించేందుకే యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్నామని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ అన్నారు. పోలీసు స్టేషన్ ఆవరణలో ఆయన చేతుల మీదుగా క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. పోలీసు శాఖ యువతకు అండగా ఉంటుందన్నారు. పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్లతో నేడు సమావేశం

డుంబ్రిగుడ: అరకులోయ, డుంబ్రిగుడ మండలాల గ్రామ సచివాలయ కన్వీనర్లతో అరకు సంతబయలు గ్రామంలోన మార్కెట్ యార్డులో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ తెలిపారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గృహ సారథులు, గ్రామ వలంటీర్లు, కన్వీనర్లకు ప్రభుత్వ సూచనల మేరకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హాజరు కానున్నట్టు చెప్పారు. సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే విధిగా పరీక్ష చేయించుకోవాలని యూ.చీడిపాలెం వైద్యుడు జయప్రకాశ్ సూచించారు. కుష్టుపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఆస్పత్రి ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. లక్షణాలు కనిపిస్తే తక్షణమే పరీక్షలు చేయించుకొని, మందులు వినియోగించాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో గంగరాజు, ఫార్మసిస్టు సురేంద్ర, ఎల్‌టీ సత్తిబాబు, ఈఎంటీ విజయ్, ఏఎన్‌ఎంలు. ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

జి.మాడుగుల: పాడేరు–జి.మాడుగుల రోడ్డు మార్గంలో బందవీధి ఘాట్ రోడ్డులో ఉన్న వెన్నెలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి

రాజవొమ్మంగి: తాళ్లపాలెంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను గ్రామంలోనే కొనసాగించాలని కోరుతూ గ్రామస్తులు ఎంపీపీ గోము వెంకటలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందజేశారు. తాళ్లపాలెంలోని ఏకలవ్య పాఠశాల రాజవొమ్మంగిలో విలీనం చేయడంతో తాళ్లపాలెం ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు పడతారని, సమస్య పరిష్కరించాలని కోరారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఆనందరావు, ముసలయ్య తదితరులున్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం



ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, పక్కన ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు



కన్నరంలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- కొయ్యూరు, రంపచోడవరంలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'లో పాల్గొన్న ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాగులపల్లి ధనలక్ష్మి

కొయ్యూరు: సంక్షేమ పథకాలు అమలులో ఏపీ దేశంలోనే ముందంజలో ఉందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గదబపాలెం పంచాయతీలో మల్లవరం, కొత్తూరు, కొత్తగదబపాలెం, పాత గదబపాలెంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అడిగి తెలుసుకున్నారు. ఆమెకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అన్ని వర్గాలకు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, మండల పార్టీ అధ్యక్షులు బాబులు, వైస్ ఎంపీపీ వెంకటరమణ, ఎంపీటీసీ బిడిజన అప్పారావు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ, సర్పంచ్‌లు భవానీ, వెంకటలక్ష్మి, నూకాలమ్మ, సురేష్ పట్నాయక్, నాయకులు సత్యనారాయణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అనేక సంక్షేమ పథకాలు

రంపచోడవరం: ప్రభుత్వం ఏజెన్సీలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలం తామరపల్లి పంచాయతీ పరిధిలోని బూరుగుబంద, కన్నరం, నూనెపల్లి, తామరపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగుపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏజెన్సీలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారన్నారరు. గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, నాయకులు రామన్నదొర, రామకృష్ణ, ఎంపీటీసీ కుంజం వంశీ, శేఖర్, రాంబాబు, కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ లాలీ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ అభిరామ్

కూనవరం: చినార్కూర్ పంచాయతీ పరిధిలోని వెంకన్నగూడెం పాఠశాలలో చిరక్ ఇంటర్‌నేషనల్ స్కూల్ చిన్నారుల సహకారంతో ఏఎస్‌సీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విద్యార్థులకు దుస్తులను సర్పంచ్ సున్నం అభిరామ్ బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ సేవలను కొనియాడారు. సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం కన్నారావు, ఏఎస్‌సీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవ నిర్వహణపై సమావేశం



సమావేశమైన కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు

కొయ్యూరు: యర్రగొండమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి ఉత్సవ నిర్వహణపై ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు బుధవారం సమావేశమయ్యారు. సమావేశంలో నేను సైతం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు కె.శివప్రసాద్‌తో పాటు పలువురు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్‌లు రత్నకుమారి, సత్యనారాయణ, బాలకృష్ణ, గ్రామ పెద్దలు రామకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: గ్రామీణ యువత అన్ని రంగాల్లో రాణించాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. రంపచోడవరం సమీపంలోని పెద గెద్దాడ గ్రామంలో అనంత చక్రరావు, మంగతాయరు మెమెరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామస్థాయిలో యువతను ప్రోత్సాహించేందుకు కృషి చేస్తుందన్నారు. గిరిజన యువత మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కష్టపడాలన్నారు. క్రికెట్ పోటీలను బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, సర్పంచ్‌లు వి.ప్రసాద్, ఎం.బొజ్జయ్య, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ రామన్నదొర, నాయకులు రామకృష్ణదొర, రాంబాబు, సత్యనారాయణరెడ్డి, కన్నబాబు, ఏఎంసీ చైర్మన్ డొక్కులూరి రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు పాడియం దీప

వై.రామవరం: మండలంలోని మడుగుకోట గ్రామంలో సచివాలయ మహిళా పోలీసు పి.దీప బుధవారం పర్యటించారు. అడ్డతీగల సీఐ వై.రాంబాబు ఆదేశాల మేరకు గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సారా, గంజాయి నిర్మూలనకు సహకరించాలన్నారు. బాల్య వివాహాలకు తావివ్వవద్దన్నారు. మహిళలకు ఏ విధమైన అన్యాయం జరిగినా దిశ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదుచేసి రక్షణ పొందాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. స్థానికులు అంగన్‌వాడీ భవనం కోరారు. ఈ విషయంపై మహిళా పోలీసు దీప స్పందించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్నా సచివాలయ మహిళా పోలీసుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం



మెనూ పరిశీలిస్తున్న ఎంపీపీ ఉషారాణి, ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్

అరకులోయ రూరల్: స్థానిక గురుకులం బాలుర వసతి గృహాన్ని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనంద్‌కుమార్ బుధవారం సందర్శించారు. పాఠశాలల నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. భోజనం రుచిగా లేదని అసహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం ఎందుకు అందజేయడం లేదని ప్రశ్నించారు. నాణ్యమైన భోజనం అందజేయకపోవడంతో అర్థాకలితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిసిందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని, మెనూ అమలుచేయాలని ఆదేశించినా ఎందువల్ల విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను అడిగితే పొంతన లేని సమాధానం చెప్పారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. నాయకుడు నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా 'ఇంటింటా గోవింద'



పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : జీవీఎంసీ విలీనగ్రామమైన కొత్తూరు నర్సింగరావుపేటలో బుధవారం ఇంటింటా గోవింద కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్సింగరావుపేట రామాలయం వీధిలో వీరేశ్వరపు పెంటారావు గంగలక్ష్మీ దంపతుల ఇంట జరిగిన కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, విష్ణు అష్టోత్తరం, లక్ష్మీ అష్టోత్తరాలతో ప్రత్యేక పూజలు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సీతారామ భజన బృందం అధ్యక్షుడు చూచుకొండ రమణ, కార్యదర్శి కళిరెడ్డి సుశీల, సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన సంఘ నేతల ఆందోళన

పెదబయలు/ముంచంగిపుట్టు: పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెదబయలు, ముంచంగిపుట్టు మండల కేంద్రాల్లో బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాలను అధికారులకు అందజేశారు. పెదబయలులో జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ విషయంపై వార్డెన్ జగత్‌రాయ్ మాట్లాడుతూ ఉదయం విద్యార్థులు టిఫిన్ చేశారని, ర్యాలీ చేపట్టినట్టు తనకు తెలియదన్నారు. పాఠశాల హెచ్‌ఎం కె.కృష్ణవేణిని వివరణ కోరగా గిరిజన సంఘ నేతలు ముందు రోజు రాత్రి తమ అనుమతి లేకుండానే విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారని, ఉదయం పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులు బయటకు వెళ్లినట్టు చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. నాయకులు సత్యనారాయణ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రైకార్ చైర్మన్‌కు పరామర్శ



బుల్లిబాబును పరామర్శిస్తున్న జెడ్పీ, జీసీసీ చైర్‌పర్సన్లు సుభద్ర, స్వాతిరాణి

సాక్షి,పాడేరు: ఇటీవల తల్లి మృతితో విషాదంలో ఉన్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబును ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణిలు పరామర్శించారు. వారు బుధవారం సుకూరుపుట్టు గ్రామానికి చేరుకున్నారు.సతక బుల్లిబాబుతో పాటు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నాయకులు మూర్తి, విశ్వ, సింహాచలం తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

వై.రామవరం: ఏజెన్సీలో ధాన్యం కొనుగోలును కొనసాగించాలని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లచ్చిరెడ్డి కోరారు. ఆలస్యంగా నాట్లు వేయడం వలన కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం పంట చేతికందిందని, అధికారులు స్పందించి, ధాన్యం కొనుగోలును ప్రారంభించాలని అభ్యర్థించారు. వెంకటేశ్వర్లు, పండు పాల్గొన్నారు.

కార్మికులకు బీమా సౌకర్యం

అరకులోయ రూరల్: కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాల కార్మిక సంఘాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్మిక శాఖ భవనం ఏర్పాటుచేయాలన్నారు. కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని , ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. నాయకులు సత్తిబాబు, సింహాచలం, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం

అనకాపల్లిటౌన్ : స్థానిక గాంధీనగరం వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అంతకుముందు ఆలయ మండపంలో ధర్మకర్తలు పరిటి భాస్కరరావు కుటుంబసమేతంగా స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

4న గృహ సారధులతో సమావేశం

పెదబయలు: మండలంలోని 16 గ్రామ సచివాలయాలు, 23 గ్రామ పంచాయతీల పరిధిలోని గృహ సారథులతో ఈ నెల 4న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సమావేశంలో పాల్గొంటారని మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు చెప్పారు. గ్రామ సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు విధిగా హాజరు కావాలని కోరారు.

అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలి

ముంచంగిపుట్టు: గిరిజన ప్రజా సంఘం, ఐక్య వేదిక నేతలు తహసీల్దార్ నర్సమ్మను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మండలంలో గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తెలియజేశారు. వారు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేయాలని కోరారు.భీమరాజు, దొర, నర్సయ్య, విశ్వనాథం, మండల వర్తక సంఘం అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తదితరులున్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- ఏడాది పొడవునా సేద్యం
- పనుల్లో మాలీ రైతుల నిమగ్నం



కూరగాయల సాగు చేస్తున్న మాలీ రైతులు

గూడెంకొత్తవీధి: కాయగూరలకు ఏడాది పొడవునా డిమాండ్ ఉంటుంది.గిరిజన ప్రాంతాల్లో మాలీ రైతులు సంప్రదాయంగా కాయగూరలు, ఆకుకూరలను ఏడాది పొడవునా పండిస్తూ లాభాలు పొందుతున్నారు. ఒడిశాకు చెందిన మాలీలు చాలా ఏళ్ల కిందటే అల్లూరి జిల్లాకు వలస వచ్చారు. మన్యం వ్యాప్తంగా సుమారు ఐదువేలకు పైగా కుటుంబాలు జీవనంసాగిస్తున్నాయి. కాయగూరల సాగు వీరికి జీవనాధారం. కౌలు రైతులుగా పంటలు పండిస్తున్నారు. స్థానికంగా గిరిజనుల భూములను కౌలుకు తీసుకుని ఏడాది పొడవునా సేద్యం చేస్తూ కాయగూరలను పండిస్తున్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా మాలీతెగకు చెందిన వారంతా కాయగూరల సాగులో నిమగ్నం అవుతారు. పండించిన కాయగూరలను ఎప్పటికప్పుడు వారపు సంతలకు తీసుకువెళ్లి విక్రయిస్తారు. మన్యంలో వ్యవసాయానికి తగినంత సాగునీరు లేకపోయినా ఉన్న వనరులనే సద్వినియోగించుకుంటున్నారు. పంట కాలువలను నిర్మించుకుంటూ పొలాలకు మళ్లించుకుంటూ అన్ని రకాల పంటలను పండిస్తున్నారు. ప్రధానంగా క్యాబేజీ, క్యాలీఫ్లవర్, టమాటా, బీట్‌రూట్, క్యారెట్, ముల్లంగితో పాటు తోటకూర, గోంగూర, పాలకూర వంటి ఆకుకూరలను పండిస్తున్నారు. సంప్రదాయ పంటలు పండించే రైతులుగా ప్రభుత్వం వీరిని గుర్తించింది. ప్రభుత్వం అందించే రాయితీలను మాలీ రైతులు సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయంలో తమకు సాటిలేదని నిరూపించుకుంటున్నారు.

ఠంఛన్‌గా పింఛన్



జి.మాడుగులలో పింఛన్ అందజేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు



గొడ్డిపుట్టులో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ పవన్‌సాయి



జీకే వీధిలో గృహసారథి సమక్షంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

ముంచంగిపుట్టు/గూడెం కొత్తవీధి/జి.మాడుగుల: జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి నెల మొదటి రోజు ముమ్మరంగా పింఛన్ పంపిణీ జరిగింది. తెల్లవారు జామునే గ్రామ వలంటీర్లు, గృహ సారథులు తదితరులు ఇంటి తలుపులు తట్టి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. పింఛన్‌దారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పింఛన్ నగదు బట్వాడ చేశారు. సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు సైతం 10వేలు పింఛన్ అందజేశారు. పింఛన్ల పంపిణీని సర్పంచులు, ఎంపీటీసీలు పర్యవేక్షించారు. గూడెం కొత్తవీధిలో మండల కేంద్రంలో గ్రామ వలంటీర్ శంకర్‌తో కలిసి గృహ సారధి పుష్ప లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును మండల పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు అందజేశారు.

ఏజెన్సీ అభివృద్ధికి కృషి



ఆస్పత్రిలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: ఏజెన్సీ అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు తమ వంతు కృషి చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రి ఆవరణలో పీజేఎస్ పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆమె బుధవారం ప్రారభించారు. ఆమె మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. ఏజెన్సీ వ్యాప్తంగా పీజేఎస్ సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఏరియా ఆసుపత్రిలో పీజేఎస్ పాల్ ఫౌండేషన్ ద్వారా రూ.5 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్, వీల్‌చైర్లు, స్ట్రెచర్లు, రోగుల సహాయకులు కూర్చునేందుకు కుర్చీలు, బల్లలను ఏర్పాటు చేశారు. ఎంపీపీ బందం. శ్రీదేవి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తమ్మన్నకుమార్, రూతూ, నాయకులు పూజ, కాంతం తదితరులు పాల్గొన్నారు.

కొత్త భవనంలో తరగతులు



రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాల నూతన భవనం

రాజవొమ్మంగి: ఏకలవ్య పాఠశాల తరగతులు ఇకపై కొత్త భవనంలో కొనసాగుతున్నాయి. అడ్డతీగల ఏకలవ్య పాఠశాల విద్యార్థులను కూడా రాజవొమ్మంగి ఈఎంఆర్‌ఎస్‌లో తరలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.వి.కృష్ణారావు మాట్లాడుతూ రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాలలో అభ్యసిస్తున్న 290 మందితో పాటు అడ్డతీగల నుంచి సుమారు 100 మంది విద్యార్థులను కలిపి తరగతులను కొత్త భవనంలో కొనసాగిస్తామన్నారు.

ఘనంగా తీర్థాలు

- ఆకట్టుకున్న జిల్లా స్థాయి ఎడ్ల, గుర్రపు పరుగు పందాల పోటీలు
- పెద్ద సంఖ్యలో తిలకించిన ప్రజలు



పోటీలో దౌడు తీస్తున్న గుర్రం

కె.కోటపాడు: దాలివలస గ్రామ దేవత ఎరుకులమ్మ పేరంటాలు తీర్థమహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల, గుర్రపు పరుగు పందాల పోటీలు జరిగాయి. గ్రామ మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి రాము నాయుడు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలు ప్రజలు తరలి వచ్చారు. పోటీల్లో విజేతలైన ఎడ్ల, గుర్రాల యజమానులకు ఎంపీపీ జగన్‌మోహన్, కొత్తపెంట సర్పంచ్ నీలిమా వెంకటరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఎ.భీమవరంలో..

ఎ.భీమవరంలో నర్సమాంబ పేరంటాలు తీర్థాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏటా భీష్మ ఏకాదశి పర్వదినం నాడు తీర్థం జరపడం ఆనవాయితీ. బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడిగా మారింది. పేరంటాలు ఆలయంలో గ్రామ సర్పంచ్ తర్రా సన్యాసమ్మ, శేషు, పాల సంఘం అధ్యక్షుడు తాడి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలను జరిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు

కశింకోట : రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రజలకు అందించాలని సామాజిక ప్రకృతి వ్యవసాయం అనకాపల్లి జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ స్వామినాయుడు కోరారు. మండలంలోని జి.భీమవరం గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. సాగుకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులను కలిసి ప్రకృతి వ్యవసాయం సాగులో ఉన్న లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ఇది ఆరోగ్యకరమైన వ్యవసాయ విధానమని పేర్కొన్నారు. దీని వలన భూముల్లో సేంద్రీయ కర్బన శాతం వృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం సాగు వల్ల ఖర్చు తగ్గి, దిగుబడులు పెరుగుతాయన్నారు. ఖరీఫ్ పంటల సాగుకు ముందు నవ ధాన్యాలు, 30 రకాల విత్తనాలు జల్లుకోవాలన్నారు. ఏడాది పొడవునా భూమిని కప్పి ఉంచాలన్నారు. ఇళ్ల వద్ద పెరటిలో ఏడాది పొడవునా ఉండే విధంగా 12 రకాల కూరగాయలు, ఆకు కూరలను ప్రకృతి సిద్ధంగా సాగు చేసుకోవాలని సూచించారు.